దండాలయ్యా.. ఉండ్రాలయ్యా

- నేడు వినాయక చవితి
- జిల్లాలో ముస్తాబైన మండపాలు
- పూజలు అందుకోనున్న గణనాథుడు
- ఊరూవాడా నవరాత్రుల సందడి

నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో వినాయక చవితి సందడి ప్రారంభమైంది. జైజై గణేశా అంటూ.. మండపాల్లో గణపతులను నెలకొల్పేందుకు నిర్వాహకులు విగ్రహాలను తరలిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతో ఆయా కాలనీ మహిళలు గణపతి విగ్రహాలకు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. గణనాథుడి తొలిపూజకు మండపాలు ముస్తాబయ్యాయి. పూజాసామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కోలాహలంగా మారాయి.

నాగర్‌కర్నూల్ : గణపతికి హారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 6 : శనివారం చవితి సందర్భంగా జిల్లా కేంద్రంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు గణపతులను ప్రతిష్ఠించేందుకు ఉత్సాహంగా మండపాలను సిద్ధం చేస్తున్నారు. విద్యుత్ కాంతుల మధ్య వారంరోజులపాటు మండపాల్లో గణపతులు పూజలు అందుకోనున్నాయి. జిల్లా కేంద్రంలో హౌజింగ్‌బోర్డు, సంతబజార్, రాఘవేంద్ర కాలనీ, రాంనగర్ కాలనీ, శ్రీనగర్, ఎర్రగడ్డ, టీచర్స్ కాలనీలో భారీ గణపతులను ప్రతిష్ఠించనున్న నేపథ్యం లో అందుకు అనుగుణంగా మండపాలను ఉత్సవ కమిటీల సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం రాత్రి చాలా వరకు భారీ గణపతులు నాగర్‌కర్నూల్ పట్టణానికి చేరుకోవడంతో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

కల్వకుర్తి మండలంలో..

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 6 : మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వినాయక ఉత్సవ మండలి నిర్వాహకులు మండపాలను వివిధ ఆకృతులలో మండపాలను సిద్ధం చేశారు. మండపాల ఆవరణలను ఆయా ఆలయాల నమూనాలను ప్రతిబింబించేలా మండపాలను సిద్ధం చేశారు. కల్వకుర్తి పట్టణంలో పాలమూరు చౌరస్తా, హైదరాబాద్ చౌరస్తా, ఎల్లికల్ చౌరస్తాల్లో వ్యాపారులు ప్రత్యేకంగా దుకాణాలను ఏర్పాటు చేసి భారీ విగ్రహాలు, మట్టి వినాయక విగ్రహాలను విక్రయించారు. కొనుగోలు చేసిన విగ్రహాలను వాహనాలలో తరలిస్తుండడంతో పట్టణంలోని సందడి నెలకొన్నది.

అమ్రాబాద్, పదర మండలాల్లో..

అమ్రాబాద్, సెప్టెంబర్ 6 : నేడు వినాయకచవితిని పురస్కరించుకొని ఏకదంతుడి ప్రతిమలను ప్రతిష్ఠించేందుకు అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లోని అన్ని గ్రామాల్లో శుక్రవారం కమిటీ నిర్వాహకులు మండపాలను ఏర్పాటు చేశారు. పోలీసులు సూచించిన విధంగా అన్ని రకాల జాగ్రత్తలు పాటించి ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా మండపాలను ఏర్పాటు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఊర్కొండ, బల్మూరు మండలాల్లో..

ఊర్కొండ/బల్మూరు, సెప్టెంబర్ 6 : ఊర్కొండ, బల్మూరు మండలాల్లోని ఆయా గ్రామాల్లో గణేశ్ ఉత్సవాలకు కమిటీ నిర్వాహకులు మండపాలను ముస్తాబు చేశారు. శనివారం వినాయక చవితి కావడంతో భక్తులు కాలనీల్లో గణపయ్యను నెలకోల్పేందుకు మండపాలను అలంకరించారు. మండపాల నిర్వాహకులు తప్పక పేర్లు నమోదు చేసుకోవాలని బల్మూరు ఎస్సై గురుస్వామి సూచించారు.

కల్వకుర్తి రూరల్ : మండపాల ఎదుట ఆకర్షణీయంగా డెకరేషన్‌లు

నాగర్‌కర్నూల్ : ఊరేగింపుగా మండపాల వద్దకు వస్తున్న గణపతి

ఊర్కొండ : రాంరెడ్డిపల్లిలో ఉత్సవాలకు ముస్తాబైన మండపం

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

వేడుకలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈవో

అచ్చంపేట, సెప్టెంబర్ 6: ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తూ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీకే ప్యాలెస్ నందు ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈవో గోవిందురాజులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ భావితరాలకు ఉపాధ్యాయులే ఆదర్శమని, భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లో ఉందన్నారు. ఉన్నతమైన విద్యార్థిగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు అహర్నిశలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి కార్పొరేట్‌స్థాయి విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు తమవంతు పాత్ర పోషించాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, ఎంఈవోలు, జీహెచ్ఎంలు, నోడల్ ఆఫీసర్లు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక

అచ్చంపేట, సెప్టెంబర్ 6: అచ్చంపేట పురపాలక శాఖ కోఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు. స్థానిక ఆర్డీవో మాధవి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కోఆప్షన్ సభ్యులుగా రాములు, ఖాదర్, జీవన జ్యోతి, షమీంలు ఎన్నికయ్యారు, నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులను శాలువతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అచ్చంపేట మున్సిపల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు అందరు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అభివృద్ధికి కావాల్సిన నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. హైడ్రను కూడా అచ్చంపేటకు తీసుకువస్తామని అక్రమంగా చెరువులు, కుంటలు ఆక్రమించిన వారిపై చట్టపరంగా ముందుకు వెళ్లాలని అన్నారు. అచ్చంపేట ప్రాంతంలో చాలా చెరువులు, కుంటలు ఉండేవని ప్రస్తుతం అవి ఇప్పుడు చాలా మటుకు లేవని ఆక్రమణకు గురైనట్లు చెప్పారు. కార్యక్రమంలో చైర్మెన్ గార్లపాటి శ్రీనివాసులు, కమీషనర్ శ్యాంసుందర్, వైస్‌చైర్‌పర్సన్ శైలజారెడ్డి, కౌన్సిలరులు, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత వాతావరణం కల్పించాలి

- మట్టి గణపతులను పంపిణీ చేసిన ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ : మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 6 : భవిష్యత్తు తరాలకు కాలుష్య రహిత వాతావరణం కల్పించడంతోపాటు పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి సూచించారు. వినాయక చవితిని దృష్టిలో ఉంచుకొని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో అందిస్తున్న మట్టి గణపతులను ఎమ్మెల్సీ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణం పట్ల ప్రజలను చైతన్య పర్చడంలో భాగంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి, సెప్టెంబర్ 6 : మట్టి వినాయకులను పూజించి పర్యావరణానికి పాటు పడుదామని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పిలుపునిచ్చారు. శుక్రవారం కల్వకుర్తి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణవాసులకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ సత్యం పట్టణవాసులకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని మున్సిపల్ చైర్మన్ పిలుపునిచ్చారు. అదే విధంగా వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్, ఏఈ షబ్బీర్, మేనేజర్ రాజకుమారి, పారిశ్రామిక వేత్త రమేశ్‌బాబు, వాసవీక్లబ్ సభ్యులు, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట/అచ్చంపేటటౌన్, సెప్టెంబర్ 6 : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు రక్షిత మహిళ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తమవంతు చైతన్యం చేస్తున్నామని సొసైటీ అధ్యక్షురాలు జయమ్మ తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని కళాంజలి బీబీసీ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. అదేవిధంగా అచ్చంపేట పట్టణంలో ఏకాదశి పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో వినాయక మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. శుక్రవారం పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ సంస్థ కన్వీనర్ కొత్త విజయ్‌కుమార్ మాట్లాడుతూ 500 మట్టి వినాయకులను ప్రజలకు పంపిణీ చేశామన్నారు. పర్యావరణాన్ని కాపాడడంలో తమ వంతు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో సభ్యులు ఉప్పల పరమేశ్, శ్రీనివాసులు, మురళి, సిద్దంశెట్టి కోటీశ్వర్, శ్యాంసుందర్, నర్సింహులు, సురేశ్, వెంకటేశ్వరశర్మ, చంద్రశేఖర్, బాలీశ్వర్, రజినికాంత్, వినోద్, తిరుపతయ్య, కామిశెట్టి శ్రీనివాసులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కల్వకుర్తి : మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

అచ్చంపేటటౌన్ : మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సభ్యులు

నిధులు మంజూరు

చారకొండ, సెప్టెంబర్ 6 : మండలంలోని జూపల్లి గ్రామంలో బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలు మంజూరు చేసి ప్రొసిడింగ్ అందజేసినట్లు కాంగ్రెస్ నేత రాములుయాదవ్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిని అడిగిన వెంటనే బీసీ కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేసిన సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని మరింతాభివృద్ధి చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

కంప్యూటర్ల వితరణ

బిజినేపల్లి, సెప్టెంబర్ 6: మండలంలోని ఊడ్చులకుంట తండా పాఠశాలకు ముడావత్ వీరు అనే వ్యక్తి రెండు కంప్యూటర్లను శుక్రవారం వితరణ చేశారు. ఇటీవల ఆయన ప్రభుత్వ ఉద్యోగిగా ఉద్యోగ విరమణ పొందడంతో తాను ఉన్న ఊరికి ఏదైనా సాంకేతిక విద్యను అందించాలనే ఉద్దేశ్యంలో గ్రామ పంచాయతీకి కంప్యూటర్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చందులాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

అక్రమ అరెస్టులు తగదు

వంగూరు, సెప్టెంబర్ 6 : ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ఎత్తి చూపితే వారిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదని బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు గణేశ్ రావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న నిరంకుశ పాలనను తెలంగాణ ప్రజలకు తెలియజేస్తున్న జర్నలిస్టులపై దాడులు చేసే సంస్కృతి కాంగ్రెస్ మానుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన పంథా మార్చుకోకపోతే తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు.

కేసు నమోదు

బల్మూరు, సెప్టెంబర్ 6 : మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన రమేశ్, వేముల శంకర్ బ్యాంక్ ఖాతాల నుంచి సైబర్ నేరాగల మొసలకు గురికావడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై గురుస్వామి శుక్రవారం తెలిపారు. రమేశ్ అకౌంట్‌లో రూ.99వేలు, శంకర్ అకౌంట్లో రూ.25వేలు సైబర్ కేటుగాళ్లు కాజేశారని ఆయన పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

ఉల్పర మాజీ సర్పంచ్ మృతి

వంగూరు, సెప్టెంబర్ 6 : మండలంలోని ఉల్పర గ్రామ మాజీ సర్పంచ్ పసుల జాన్‌రెడ్డి(70) అనారోగ్యానికి గురై శుక్రవారం మృతి చెందాడు. 1995లో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. జాన్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య సువర్ణ, ఇద్దరు కూతురులు, కుమారుడు ఉన్నారు. ఆయన మృతదేహానికి వివిధ పార్టీల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 6 : తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లిలో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం మేరకు గ్రామానికి చెందిన బాలస్వామి (50) గురువారం రాత్రి ఇంట్లో ఎవ్వరులేని సమయంలో ఇంటి ముందర రేకులకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

- అదనపు ఎస్పీ సీహెచ్ రామేశ్వర్

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 6: మహిళలు, బాలికల భద్రతకే షీటీమ్ పనిచేస్తుందని అదనపు ఎస్పీ సీహెచ్ రామేశ్వర్ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైంగిక వేధింపులు, దాడులు, యాంటి ర్యాగింగ్, ఆత్మహత్యలు, సైబర్ క్రైమ్, టీసేఫ్ అప్లికేషన్స్, బాలికల అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. మహిళలకోసం కేంద్ర తీసుకొచ్చిన కొత్త చట్టాల గురించి వివరించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ మహిళల భద్రతకోసం ప్రత్యేకంగా ప్రతి జిల్లాలో షీటీమ్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తే 100 లేదా షీటీమ్ 8712657676 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో షీటీమ్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, సభ్యులు వెంకటయ్య, వెంకటేశ్‌నాయక్, భరోసా సెంటర్ జిల్లా కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అదనపు ఎస్పీ రామేశ్వర్

మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోండి

కల్వకుర్తి, సెప్టెంబర్ 6 : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో మిగిలి ఉన్న సీట్లకు నాలుగో విడుతగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కల్వకుర్తి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జయమ్మ తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు తమ దరఖాస్తులను www:iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతర అభ్యర్థులు ఈనెల 9 నుంచి 20వ తేదీలోగా నేరుగా ఆయా సంబంధిత ఐటీఐ కళాశాలలకు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో వెళ్లి వాక్‌ఇన్ అడ్మిషన్‌లు పొందాలని సూచించారు. వివరాలకు 8096402785, 9441784176 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 6 : మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారు రేషన్‌కార్డు లేకుంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయాధికారి శిరీష తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో దాదాపు 900 మంది రైతులు రేషన్‌కార్డు లేని వారు రుణమాఫీకోసం ఆన్‌లైన్‌లో, రైతు వేదికల వద్ద దరఖాస్తు తీసుకుంటున్నట్లు తెలిపారు. వివరాలకోసం రైతులు రైతు వేదికల వద్ద సంప్రదించాలని కోరారు.

మానవతా దృష్టితో వైద్యసేవలు అందించాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కేవీ.స్వరాజ్యలక్ష్మి

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 6 : ప్రతి వైద్యుడు మానవతా దృష్టితో వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రైవేట్ దవాఖానల డాక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, చికెన్‌గున్యా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు ప్రబులుతున్నాయని, ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల సమన్వయంతో ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనుమానిత డెంగీ వ్యాధిగ్రస్తులను దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించి, డెంగీ జ్వరంగా గుర్తించిన తర్వాత ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి ప్రైవేట్ క్లీనిక్, దవాఖానలో, ల్యాబ్‌ల్లో ధరల పట్టికను ఉంచాలన్నారు. కార్యక్రమంలో అదనపు వైద్యాధికారి వెంకటదాసు, డాక్టర్ తారాసింగ్, డాక్టర్ బీమానాయక్, జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసరావు, ప్రైవేట్ డాక్టర్లు, యాజమాన్యం, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి

బిజినేపల్లి : మాట్లాడుతున్న డీడబ్ల్యూవో రాజేశ్వరి

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

ఊర్కొండ, సెప్టెంబర్ 6 : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని అంగన్‌వాడీ కేంద్రం పర్యావేక్షకురాలు కరునమ్మ అన్నారు. మండలంలోని బొమ్మరాజుపల్లిలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని కిశోర బాలికలు గర్భిణులు, చిన్నారులు తీసుకోవల్సిన అహారం, సంపూర్ణ ఆరోగ్యంపై సమావేశం నిర్వహించారు. అనంతరం మహిళలతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

బిజినేపల్లిలో..

బిజినేపల్లి, సెప్టెంబర్ 6: సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం పౌష్టికాహారాన్ని తీసుకోవాలని డీడబ్ల్యూవో రాజేశ్వరి అన్నారు. శుక్రవారం బిజినేపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులు, మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సంగీత, ఎంపీడీవో ఖతాలప్ప, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగింత

వెల్దండ, సెప్టెంబర్ 6 : సెల్‌ఫోన్లు పోగొటుకున్న ముగ్గురు వ్యక్తులకు వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి అప్పగించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లకు చెందిన యాదగిరి, వెల్దండకు చెందిన జితేందర్‌రెడ్డి, మాదారానికి చెందిన మల్లేశ్, వనపర్తికి చెందిన గణేశ్‌లు సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. దీంతో పోలీసులు ట్రేస్ చేసి సెల్‌ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకొని శుక్రవారం బాధితులను వెల్దండ పోలీస్ సర్కిల్ కార్యాలయానికి పిలిపించి సెల్‌ఫోన్లను వారికి అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★మహబూబ్‌నగర్, భగీరథ కాలనీ, E/F, 200 చ.గ.ల ప్లాటు అమ్మబడును, కంపౌండ్ వాల్, గేటు కలదు, క్లియర్ టైటిల్ సంప్రదించండి సెల్: 6301465612
NT-MBNR

KIDNY STONES
★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం. అనుభవంతో 100% గ్యారంటీ, జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: వైట్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580
NT- 332617

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం 16 K to 18K, ఏజెంట్ కమిషన్ 6K Ph: 9640258899/9640468899.
NT-331758

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748